## క్లుప్తంగా

### మట్టి తరలింపు అడ్డగింత



అయినాపూర్‌లో మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లి గ్రామం నుంచి అయినాపూర్ గ్రామంలోని ఓ వెంచర్‌కు మట్టి తరలిస్తున్న వాహనాలను సర్పంచ్ చెరుకు రమణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులను పలుమార్లు సంప్రదించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మట్టి తరలింపు నిలిపివేయాలని కోరారు. అనంతరం కొమురవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

### అత్యాశకు పోతే అంతే..

సిద్దిపేటకమాన్: అపరిచితుడు పంపిన లింక్‌ను ఓపెన్ చేసి బాధితుడు తన ఖాతాలో నుంచి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో జరిగింది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నాను అంటూ మాటలు కలిపాడు. మీరు ఆర్డర్ చేసిన వస్తువులు డెలివరీ చేస్తున్నాము, అన్ని వస్తువులు ఉన్నాయో? లేదా ? అని చెక్ చేసుకోవాలని ఓ లింకును బాధితుడి సెల్‌ఫోన్‌కు పంపించాడు. అది నమ్మిన బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే తన ఖాతా నుండి రూ.31,497 డబ్బులు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

**అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు**

గజ్వేల్‌రూరల్: లాటరీ వచ్చిందని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ల మాయలో పడొద్దని శనివారం గజ్వేల్ పోలీసులు అన్నారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాధితునికి గుర్తు తెలియని నంబర్ నుంచి సైబర్ నేరస్తుడు కేరళ లాటరీ నుంచి ఫోన్ చేస్తున్నామని, రూ.5 లక్షల లాటరీ వచ్చిందని నమ్మబలికాడు. లాటరీ డబ్బులు రావాలంటే ఒక శాతం టాక్స్, జీఎస్టీ చెల్లించాలన్నాడే. దీంతో సైబర్ నేరస్తుడు చెప్పిన విధంగా రూ.5 వేలు పంపించి, తర్వాత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయాయని తెలుసుకొని జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి రూ.1400 ఫ్రీజ్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.



# అనుమతి లేకుండా చెట్ల కూల్చివేత

- ఆనవాళ్లులేకుండా నిప్పుపెడుతున్న వైనం
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

నర్సాపూర్: ఓ వెంచర్‌లో చెట్లను నరికి ఆనవాళ్లు లేకుండా వాటికి నిప్పు పెడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే పలు రకాల భారీ వృక్షాల తోపాటు తాటి చెట్లను వెంచర్ నిర్వాహకులు నరికి కాల్చివేస్తున్నా ఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మండలంలోని ఎల్లాపూర్‌లో భూ వ్యాపారులు సుమారు 53 ఎకరాలలో ఫాంల్యాండ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం కొనుగోలు చేసిన భూమిని చదును చేసే పనులు చేపట్టారు. అందులో ఉన్న భారీ వృక్షాలతోపాటు పదుల సంఖ్యలో తాటిచెట్లను నరికి వాటిని కాల్చివేస్తున్నారు.

ఆయా రకాల చెట్లను నరకడానికి రెవెన్యూ శాఖ నుంచి, తాటి చెట్లను నరకడానికి ఎక్సైజు శాఖ



ఎల్లాపూర్ వెంచర్‌లో తగలబడుతున్న తాటి చెట్లు

నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కాగా ఏ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందకుండానే చెట్లను కూల్చివేస్తున్నారు. తాటి చెట్లను నరికి వాటి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మొదళ్లకు నిప్పంటిస్తున్నారు. అడ్డగోలుగా చెట్లను నరకడంతో పాటు ఆనవాళ్లు లేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయంపై ఎక్సైజు సీఐ పద్మను వివరణ కోరగా ఎల్లాపూర్‌లో తాటి చెట్లు నరికినట్లు తమ దృష్టికి రాలేదన్నారు. చెట్ల నరికివేతకు తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. వెంచర్ సూపర్‌వైజర్ నరేశ్‌ను అనుమతులు పొందారా అని అడగ్గా తనకు ఏమీ తెలియదని బదులిచ్చాడు.

# మైనర్లు వాహనాలు నడపొద్దు

సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ



ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మైనర్లు వాహనాలు నడపొద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రంగధాంపల్లిలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్, మోటారు వాహనాల చట్టాలు, రోడ్డు సేఫ్టీ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. మానవ తప్పిదం, అధిక వేగం, మద్యం తాగి వాహనాలు నడపడంవల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. త్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారికి ఈ-చలాన్‌ల ద్వారా జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రాంగ్ రూట్లో వాహనం నడపొద్దని, పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్క్ చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ లేజర్ గన్ ద్వారా రాజీవ్ రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించడానికి కేసులు ఏ విధంగా నమోదు చేయడం జరుగుతుందో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సిగ్నల్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జనగామ, గౌరవెల్లి గ్రామాలను విలీనం చేస్తే ఊరుకోం

- అఖిలపక్షం నాయకులు



సమావేశమైన అఖిలపక్ష నేతలు

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ ప్రకటించిన అక్కన్నపేట మండలంపై చిన్నచూపు ఎందుకని, జనగామ, గౌరవెల్లి గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తే ఊరుకోబోమని అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అక్కన్నపేట మండలంలో కొనసాగుతున్న సమీప గ్రామాలను హుస్నాబాద్‌లో కలపాలన్న ఆలోచన మానుకోవాలన్నారు. అక్కన్నపేట మండల ఉనికి ప్రమాదంలో నెట్టేందుకు కుట్ర సాగుతోందని, ఇందులో భాగంగానే గౌరవెల్లి ప్రాజెక్టు ఉందని ఆ గ్రామాన్ని విలీనం చేస్తున్నారన్నారు. త్వరలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించాలని, స్పందించకుంటే ఆందోళనకు దిగుదామని తీర్మానం చేశారు. సమావేశంలో అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ కందుల రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కర్ణకంటి శ్రీశైలం, జాగిరి సత్యనారాయణ, కాశబోయిన ఎల్లయ్య, తొందూరు ఎల్లయ్య, బీజేపీ నాయకులు నూనావత్ మోహన్‌నాయక్, భూక్య సుధాకర్ నాయక్, చెరుకు సంపత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అపరిచితుడి హల్‌చల్

చితకబాదిన కాలనీవాసులు



కాలనీలో సంచరించిన వ్యక్తి ఇతడే..

జిన్నారం(పటాన్‌చెరు): రాత్రి వేళలో షర్ట్‌లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో అర్ధరాత్రి ఓ వ్యక్తి షర్ట్ లేకుండా తిరుగుతుండటంతో స్థానికులు గమనించారు. మతిస్థిమితంలేనివాడిగా ప్రవర్తిస్తూ ఓ ఇంటి గేటు ముందు సంచరిస్తున్నాడు. తెల్లవారుజాము వరకు స్థానికులు అతడిని గమనిస్తూ ఉండి పట్టుకున్నారు. ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తూనే చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పిచ్చివాడిలా ఉన్నాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. షర్ట్ లేకుండా తిరుగుతున్న వ్యక్తి చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన వారు తిరుగుతున్నారేమోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో కాలనీలో బందోబస్తును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## చిన్నారిపై వృద్ధుడి అత్యాచారయత్నం

- చితకబాది పోలీసులకు అప్పగించిన కుటుంబ సభ్యులు



వృద్ధుడిని తీసుకువెళ్తున్న పోలీసులు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లా అందోల్ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ బాలిక దగ్గర్లోని కిరాణా షాపులో చాక్లెట్ కొనుక్కోవడానికి ఇంటి నుంచి బయలుదేరింది. బాలిక వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో అటుగా వెళ్తున్న అదే ప్రాంతానికి చెందిన వడ్డే సాయిలు (60) ఆమెపై అత్యాచారాయత్నానికి ప్రయత్నించాడు. చిన్నారి తల్లి చూసి అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి వృద్ధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే జోగిపేట ఎస్‌ఐ సామ్యా నాయక్ వచ్చి వృద్ధుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు - ఆటో ఢీ

- ఒకరి పరిస్థితి విషమం
- మరో యువకుడికి గాయాలు



గాయపడ్డ ఆటో డ్రైవర్ తిరుమల్ రెడ్డి

దుబ్బాక: ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు- ఆటో ఢీ కొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం జరిగింది. 108 సిబ్బంది, స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొగుట మండలం వర్ధరాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎరువ తిరుమల్ రెడ్డి, అతడి స్నేహితుడు రేపాక ప్రసాద్ పని నిమిత్తం దుబ్బాకు వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. హబ్సీపూర్ నుంచి దుబ్బాక వస్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ తిరుమల్ రెడ్డికి తీవ్రంగా, ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ తిరుమల్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

**గుర్తు తెలియని వాహనం ఢీకొని..**

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తూప్రాన్ నర్సాపూర్ ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన జంగిడి శ్రీనివాస్ తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పోతురాజుపల్లిలో నివాసం ఉంటున్నాడు. శనివారం టీవీఎస్ ఎక్సెల్‌పై చండీకి వచ్చి తిరిగి పోతురాజుపల్లికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



శివ్వంపేట(నర్సాపూర్): తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్

## చికిత్స పొందుతున్న వివాహిత మృతి



స్రవంతి (ఫైల్)

రామాయంపేట(మెదక్): యువకుడి దాడిలో తీవ్రంగా గాయపడిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన చౌకి స్రవంతి (42) గతనెల 28వ తేదీన తన ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన పున్న శ్రీకాంత్ కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడటంతో ఆమెను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త లక్ష్మీపతి, కూతురు, కుమారుడు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడి మృతి



కనకయ్య మృతదేహం

మర్కుక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వార్డు మెంబర్ మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కనకయ్య(42) శనివారం ఉదయం మర్కుక్ మండలం పాములపర్తికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చేబర్తి సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ కనకయ్య బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ మేరకు మర్కుక్ ఎస్‌ఐ హరీశ్ కేసు నమోదు చేసుకొన్నారు. కనకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

## చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడు..



షేక్ మహబూబ్ మియా (ఫైల్)

రాయికోడ్(అందోల్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పాంపాడ్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఏడుకొండలు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ మియా (36) చేపల వేట కోసం మార్చి 30వ తేదీన పాంపాడ్ శివారులోని మంజీరా నది బ్యాక్ వాటర్‌లో చేపల వేట కోసం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలోని పరిచయస్తుల వద్ద ఆరా తీసి నది పరిసరాల్లో వెతికారు. మహబూబ్‌మియా దుస్తులు, ఇతర వస్తువులు చెరువు ఒడ్డున ఉండటంతో నది నీటిలో గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం నీటిలో మృతదేహం తేలింది. మృతుడి భార్య సహేరా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

## బెజ్జంకిలో స్వీట్ షాపుల తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని పలు స్వీట్ షాపులను ఎస్‌ఐ ప్రవీణ్‌రాజు సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. తాజాగా తయారు చేసిన తినుబండారాలను విక్రయించాలని సూచించారు. హోటల్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఎక్కువ రోజులు తినుబండారాలుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



బెజ్జంకి స్వీట్ షాపులో స్వీట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌రాజు

## బస్సులో మర్చిపోయిన బ్యాగు, నగదు అందజేత



వృద్ధురాలికి సంచి అందిస్తున్న డ్రైవర్, కండక్టర్

కొండపాక(గజ్వేల్): బస్సులో మరిచిపోయిన బ్యాగు, నగదును ఆర్టీసీ సిబ్బంది వృద్ధురాలికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెలికట్టకు చెందిన వృద్ధురాలు దుద్దెడ లచ్చవ్వ శనివారం మధ్యాహ్నం జనగామలో సిద్దిపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. లచ్చవ్వ ఆగమై వెలికట్ట గ్రామ శివారులో జనగామ క్రాస్‌రోడ్డు వద్ద బస్సు దిగింది. దీంతో బస్సు వెళ్ళిపోయింది. బస్సు దిగిన వృద్ధురాలు లచ్చవ్వ ఏడుస్తూ కనిపించింది. విషయం తెలుసుకున్న శేఖర్ లచ్చవ్వ వద్ద ఉన్న టికెట్ ఆధారంగా బస్సు డ్రైవర్ ఫోన్ చేసి విషయం తెలిపాడు. మళ్లీ సిద్దిపేట నుంచి జనగామ వెళ్లే దారిలో జనగామ క్రాస్ రోడ్డు వద్ద బస్సు డ్రైవర్ నర్సింహులు, కండక్టర్ కృష్ణవేణి లచ్చవ్వ సంచితో, అందులో ఉన్న రూ.2 వేల నగదు అందజేశారు.

## ఎన్సీఎల్ పరిశ్రమల యజమాని..



మధు (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం తురకల ఖానాపూర్ శివారులోని ఎన్సీఎల్ గ్రూప్ పరిశ్రమల ఎండీ, వెన్నెల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కలిదిండి మధు (67) శనివారం మృతి చెందారు. ఈయన మండల పరిధిలోని తురకల ఖానాపూర్, ముచ్చర్ల గ్రామపంచాయతీలలో గత 35 సంవత్సరాల క్రితం నాగార్జున సెక్యులర్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) పరిశ్రమను నెలకొల్పారు. ఆ పరిశ్రమలో స్థానికులకే ఉపాధి కల్పించాడు. అంతేకాకుండా వింటెక్, ఎన్‌సీఎల్ సెక్యులర్ పేర్లతో పరిశ్రమలను నెలకొల్పారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లలకు విద్యను అందించడం కోసం వెన్నెల ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేశారు. కాగా కొన్నిరోజులుగా కలిదిండి మధు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస వదిలారు. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమల కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తుర్కలఖానాపూర్ శివారు ఎన్‌సీఎల్ పరిశ్రమ నుంచి దౌల్తాబాద్లోని తెలంగాణ తల్లి చౌరస్తా వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.

## రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టి..



సాయి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూర్ బీడీఎల్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న వీర వెంకట సాయిరామ్ అలియాస్ సాయి(20)ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయి తండ్రి వెంకటరావు బీడీఎల్ కార్మికుడు. వారికి భారతినగర్ డివిజన్ పరిధి బీడీఎల్ కాలనీలో ఇల్లు ఉంది. ఇంటి పని నిమిత్తం సాయి బీడీఎల్ కాలనీకి వచ్చాడు. తిరిగి మధ్యాహ్నం తన వాహనంపై లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామచంద్రారెడ్డినగర్ కాలనీ ముఖద్వారం వద్ద జాతీయ రహదారిపై కొందరు బస్సు ముందు నుంచి రోడ్డు దాటుతున్నారు. అందులో ఒకరిని ఢీ కొట్టి సాయి ప్రైవేట్ బస్సు కిందపడిపోయాడు. బస్సు సాయి తలపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుయ్యారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాధ్ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పద స్థితిలో ..



శివశంకర్ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలో ఓ వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్వెల్లి గ్రామానికి చెందిన సుకూరి శివశంకర్(46) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని విచారించినా శివశంకర్ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం శ్రీ లక్ష్మీనర్సింహా వైన్స్ సిబ్బంది శుభ్రం చేయడానికి వచ్చి చూడగా వైన్స్ పర్మిట్‌రూంలో విగతజీవిగా కనిపించాడు. దీంతో మృతుడి కుటుంబీకులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కొన్నేళ్లుగా శివశంకర్‌కు మద్యం తాగే అలవాటు ఉన్నప్పటికీ ఇలా జరగలేదని ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, మహిళలు వైన్స్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైన్స్ షాపుపై రాళ్లతో దాడిచేశారు. బోర్డులను ధ్వంసం చేయడంతో పాటు తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. శివశంకర్ మృతిచెందిన ఘటనపై వైన్స్ నిర్వాహకులు పరామర్శించడానికి రాకపోవడంతో మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు వైన్స్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేవరకు కదిలేది లేదని మృతదేహాన్ని వైన్స్ ఎదుట ఖననం చేసేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు, కుటుంబీకులు కలిసి రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనకారులు శాంతింపజేశారు. జోగిపేట సీఐ నాగరాజు, ఎస్‌ఐ సామ్యానాయక్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు చివరికి ఖననం చేసేందుకు తీసిన గోతిలో కోడిని పూడ్చివేసి వెళ్లిపోయారు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ అంబర్యా తెలిపారు.

## వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): మాద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం పొందాడు. ఈ ఘటన శనివారం వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వేలూరుకు చెందిన చీమల శేఖర్(30)కు భార్య భాగ్య, రెండేళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కొంత కాలం నుంచి మృతుడు మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఇబ్బందిపెడుతున్నాడు. వారం కిందట శేఖర్ భార్య భాగ్య పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం శేఖర్ మద్యం తాగొచ్చి చెల్లెలి పెళ్లి విషయమై తండ్రి రమేశ్‌తో గొడవపడ్డాడు. ఆ తరువాత రాత్రి భోజనం చేసి నిద్రించేందుకు ఒకటో అంతస్తులోని తన బెడ్రూంకు వెళ్లి గడియ వేసుకున్నాడు. శనివారం ఉదయం అన్న గదికి వెళ్లిన చెల్లెలు తలుపులు తెరిచేందుకు ప్రయత్నించింది. లోపల గడియవేసినట్లు గమనించి కుటుంబీకులకు తెలిపింది. వారు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిచూడగా శేఖర్ ఉరేసుకుని కనిపించాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**చెరువులో దూకి మహిళ..**

చేర్యాల(సిద్దిపేట): భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో మనస్తాపం చెంది భార్య ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తదొమ్మాట గ్రామానికి చెందిన బాల్‌నర్సయ్య కొద్ది రోజుల క్రితం చెట్టు కొట్టే క్రమంలో తలపై కొమ్మ తగిలి గాయపడ్డాడు. శస్త్రచికిత్స జరిగినా ఆరోగ్యం కుదటపడలేదు. దీంతో భార్య చింతల కలవ్వ(43) తీవ్ర మనస్తాపం చెందింది. శుక్రవారం జొన్నలు తెస్తానని వెళ్లి తిరిగిరాలేదు. పుట్టింటికి వెళ్లిందని భర్త భావించాడు. శనివారం ఉదయం చేర్యాల పెద్ద చెరువులో దూకి కలవ్వ ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు బాల్‌నర్సయ్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాల్‌నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లారీ దొంగ రిమాండ్




మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసిన లారీని ఎత్తుకెళ్లిన దొంగను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చత్తీస్‌గఢ్‌కు చెందిన దేవనారాయణ్ సాహుగా గుర్తించారు.

## మున్సిపల్ సిబ్బందిపై దాడి

గజ్వేల్‌రూరల్: మున్సిపల్ సిబ్బంది విధులను అడ్డుకొని, వారిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు శనివారం గజ్వేల్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ దేవాలయ సమీపంలో అక్రమంగా నిర్మించిన దాబా(రెస్టారెంట్) కట్టడాన్ని తొలగించాలని ఇటీవల మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అక్రమ కట్టడ నిర్వాహకులు గాజుల చంద్రమౌళి, అతని ముగ్గురు కొడుకులు శనివారం అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన మున్సిపల్ టీపీవో శ్రీధర్‌రెడ్డి, సిబ్బందిపై దాడి చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని టీపీవో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి మెదక్
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023





## చెట్ల కూల్చివేత

నర్సాపూర్ మండలం ఎల్లాపూర్‌లోని ఓ వెంచర్‌లో అనుమతి తీసుకోకుండా చెట్లు కూల్చారు. ఆపై వాటిని కాల్చారు. 8లో..



## మైనర్లు వాహనాలు నడపొద్దు

మైనర్లు వాహనాలు నడపొద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. 8లో..

## మరో ఏడుగురికి కరోనా

మెదక్‌జోన్: జిల్లాలో శనివారం మరో ఏడుగురు కరోనా బారిన పడ్డారని డీఎంహెచ్‌ఓ చందూనాయక్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 87 మందికి కరోనా పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. మెదక్‌లో నలుగురికి, కౌడిపల్లి, వెల్దుర్తి, టేక్మాల్‌లో ఒక్కొక్కరికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు చెప్పారు.




## న్యూస్‌రీల్

### మెడికల్ కాలేజీ ఏమైంది?



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

మెదక్‌జోన్: జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేశామని చెప్పిన మంత్రి హరీశ్‌రావు ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం మెదక్‌లో ఆయన మట్లాడుతూ.. మెడికల్ కాలేజీకి ఇప్పటివరకు కనీసం స్థల సేకరణ కూడా చేయలేదని వాపోయారు. ఈ విషయంపై ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, అధికార ప్రతినిధి మహేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు మన్సూర్, మెదక్, శంకరంపేట మండలా అధ్యక్షులు రాజు, ఉదయ్ పాల్గొన్నారు.

### కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మహిళలతో మాట్లాడుతున్న నందా డాగ్ల

మెదక్‌జోన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని మహిళా మోర్చా నేషనల్ కౌన్సిల్ మెంబర్ నందా డాగ్ల పేర్కొన్నారు. శనివారం రామాయంపేట మండలంలోని ఝాన్సీలింగాపూర్ అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ ఎక్కల దేవి మధు, నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బెండ వీణ, తదితరులు పాల్గొన్నారు.

### 'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

మెదక్ కలెక్టరేట్: రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని డీఈఓ రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 10,700 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వారికి కావాల్సిన కనీస వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు పరీక్షకు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైతే అనుమతించమన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశామని.. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

### ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



బస్సులో టికెట్ తీసుకుంటున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌జోన్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ ఆర్టీసీ డిపో ఆవరణలో మూడు నూతన డీలక్స్ బస్సులను ఆమె ప్రారంభించారు. అనంతరం టికెట్ కొని డిపో నుంచి కలెక్టరేట్ వరకు ప్రయాణించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం మెదక్ నుంచి సికింద్రాబాద్‌కు మూడు బస్సులు వేసినట్టు తెలిపారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు మెదక్ నుంచి బస్సు సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, ఆర్టీసీ ఆర్‌ఎం సుదర్శన్, డీఎం రవిచంద్ర, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు, మానవ సంబంధాలు..అనుబంధాలు వెండితెరపై అద్భుతంగా ఆవిష్కృతమైన 'బలగం' సినిమాలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నటించారు. కొమురయ్య అల్లుడు నారాయణ పాత్రలో రామాయంపేటకు చెందిన ఐరేని మురళీధర్‌గౌడ్, సర్పంచ్ పాత్రలో హత్నూరకు చెందిన వాసుదేవరావు, రైతు, ప్రొడక్షన్ కంట్రోలర్‌గా హుస్నాబాద్‌కు చెందిన రవితేజ మెప్పించారు. - సాక్షి, సిద్దిపేట

SAKSHI SUNDAY Special

### కొమురయ్య అల్లుడిగా..



మురళీధర్‌గౌడ్

కొమురయ్య అల్లుడి పాత్రలో నటించిన మురళీధర్‌గౌడ్ విద్యాభ్యాసమంతా సిద్దిపేట జిల్లాలోనే. ఏడో తరగతి వరకు సిద్దిపేటలో, 8 నుంచి 11వ తరగతి వరకు గజ్వేల్‌లో విద్యనభ్యసించాడు. పీయూసీ, డిగ్రీ 1974 సంవత్సరంలో సిద్దిపేటలో పూర్తి చేశాడు. పదేళ్ల పాటు రామాయంపేటలో వ్యాపారం కూడా చేశారు. 1984లో విద్యుత్‌శాఖలో ఎల్‌డీసీ పోస్టింగ్ తీసుకొని వనపర్తిలో పనిచేశాడు. 2002లో హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. తర్వాత హైదరాబాద్‌లోని విద్యుత్‌శాఖ కార్పొరేట్ కార్యాలయంలో జేఏఓగా 2012 జనవరిలో ఉద్యోగ విరమణ పొందారు. మురళీధర్‌కు చిన్ననాటి నుంచే నాటకాలకంటే మక్కువ. ఉద్యోగ విరమణ తర్వాత పూర్తిస్థాయి సమయం దొరకడంతో సినిమా ప్రయత్నాలు మొదలు పెట్టారు. 2017 నాటికి సినిమా ట్రాక్‌లోకి వచ్చాడు. పెళ్లిచూపులు సినిమా డైరెక్టర్ తరుణ్ భాస్కర్ ×పిట్టకథలు₹ వెబ్ సిరీస్‌లో మొదటగా మురళీధర్‌కు నటించే అవకాశం లభించింది. ఆ తర్వాత డీజే టిల్లు సినిమాలో హీరో తండ్రిగా రోల్‌లో కనిపించాడు. దీంతో క్రమక్రమంగా సినిమా అవకాశాలు పెరిగాయి. ఆ తర్వాత బలగం సినిమాలో కొమురయ్య అల్లుడి పాత్రకు అవకాశం వచ్చింది. సినిమాలో నారాయణ పాత్ర మెయిన్‌రోల్‌లో ఒకటి కావడం, అద్భుతంగా నటించడంతో ఆయనకు సినిమా ఆఫర్లు పెరిగాయి. మంగళవారం, స్క్వేర్, భగత్‌సింగ్ సినిమాల్లో నటిస్తున్నాడు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోనే నివాసముంటున్నాడు. బంధువులు, స్నేహితులు సిద్దిపేట, మెదక్‌లో ఉన్నారు. అప్పుడప్పుడు ఇక్కడకు వచ్చి వెళుతూ ఉంటాడు. తరుణ్‌భాస్కర్ వలనే బలగం సినిమాలో అవకాశం లభించిందని, నాకు మంచి గుర్తింపు వచ్చిందని మురళీధర్ సంతోషం వ్యక్తం చేశారు.

### రైతుగా రవితేజ



బలగం సినిమాలో రైతుగా నటించిన రవితేజ స్వస్థలం హుస్నాబాద్. ఇంటర్ వరకు హుస్నాబాద్, సిద్దిపేటలో డిగ్రీ పూర్తి చేశాడు. రవితేజకు కూడా చిన్నతనం నుంచే సినిమాలపై ఆసక్తి ఉంది. 2004లో సినీరంగంలోకి అడుగుపెట్టాడు. ఆపై కరీంనగర్‌పై ఓ ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు చేశాడు. 2019 నుంచి నిర్మాత దిల్ రాజు వద్ద ప్రొడక్షన్ కంట్రోలర్ పనిచేస్తున్నాడు. మంత్రా -2 సినిమాకు కోప్రొడ్యూసర్‌గా చేశాడు. తొలిసారిగా బలగం సినిమాలో హీరో పొలం పక్కన రైతుగా నటించారు. హీరో తండ్రికి, ఆ రైతుకు ఒక మారు గొడవ జరిగే సన్నివేశంలో నటించాడు. ప్రస్తుతం మా టీవీలో వస్తున్న మధురానగరి సీరియల్‌కు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. బలగం సినిమాకు కూడా ప్రొడక్షన్ కంట్రోలర్‌గా కొనసాగాడు. నాకు టర్నింగ్ పాయింట్ బలగం సినిమానే అని రవితేజ చెప్పారు.

### సర్పంచ్‌గా వాసుదేవరావు



బలగం సినిమాలో సర్పంచ్ పాత్రలో కనిపించిన వాసుదేవరావుది హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ స్వస్థలం. పదోతరగతి వరకు దౌల్తాబాద్‌లో, ఇంటర్ నర్సాపూర్‌లో చదివాడు.1992లో సినిమా డిస్ట్రిబ్యూటర్ రంగ ప్రవేశం చేశాడు. నైజాం ఏరియా పరిధిలో పదుల సంఖ్యలో సినిమాలు విడుదల చేశారు. బలగం సినిమా డైరెక్టర్ వేణు ప్రోత్సాహంతో తొలిసారిగా వెండితెరపై కనిపించి సర్పంచ్ పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో ఉంటూ సినిమా డిస్ట్రిబ్యూటర్‌గా కొనసాగుతున్నా, నటనపై ఆసక్తి ఉందని చెబుతున్నాడు. ఆయన బంధువులు దౌల్తాబాద్‌లో ఉంటున్నారు. అద్భుతమైన సినిమాలో సర్పంచ్ క్యారెక్టర్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా అని వాసుదేవరావు చెప్పారు.

### పాత రోజుల్లోకి...



దుబ్బాక: లచ్చపేటలో...

కొన్ని దశాబ్దాల కిందటి వరకూ గ్రామం మధ్యలో లేదా రచ్చబండ వద్ద ప్రొజెక్టర్‌తో సినిమాలు వేసేవారు. రాత్రివేళ ఆ గ్రామ ప్రజలంతా అక్కడకు చేరి సినిమాలు చూసేవారు. బలగం సినిమాకు ప్రస్తుతం ఆ ట్రెండ్ కనిపిస్తోంది. పలు గ్రామాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్‌తో ఈ సినిమా ప్రదర్శిస్తున్నారు. కోహెడ మండలం బస్వాపూర్, నారాయణరావు పేట మండలం గుర్రాలగొంది, చిన్నకోడూరు మండలం రామంచలో బలగం సినిమాను ప్రదర్శించారు. దుబ్బాక పరిధిలోని లచ్చపేటలో శనివారం రాత్రి బలగం సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ నంద్యాల శ్రీజ శ్రీకాంత్, దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, దుబ్బాక సీఐ బత్తుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పండగలా మహనీయుల జయంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: మహనీయుల జయంతి ఉత్సవాలను పండగలా జరుపుదామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 5న మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్, 14న బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు అన్ని సంఘాలు సహకరించాలని కోరారు. మహనీయుల జీవిత చరిత్ర, సందేశాలు భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్, పాటల పోటీలు నిర్వహించాలని డీఈఓకు సూచించారు. రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయడంతో పాటు ఎస్సీ స్టడీ సర్కిల్, అంబేడ్కర్ భవన్ నిర్మించాలని పలువురు నాయకులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్, డీఎస్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ సాయిబాబ, మున్సిపల్ కమిషనర్ జానకిరాం సాగర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. జూన్‌లోగా పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల పురోగతిపై సమీక్షించారు. మొత్తం 107 ఉప కేంద్రాలు నిర్మాణాలు చేపట్టగా 12 మాత్రమే పూర్తయినట్లు తెలిపారు. మిగితా వాటిని సైతం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ చందూనాయక్ పాల్గొన్నారు.

**ఇళ్ల క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు**

అసైన్డ్ భూముల్లో ఇళ్లు కట్టుకున్న నిరుపేదలు వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నేడు అధికారికంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు మెదక్ పట్టణ శివారులోని పసుపులేరు ఒడ్డున గల పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. వివిధ సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## రెండో విడత గొర్రెల పంపిణీకి చర్యలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం సీఎస్ శాంతికుమారి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 6,152 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. రూ.1.75 లక్షల విలువ గల ఒక్కో యూనిట్‌లో 75శాతం ప్రభుత్వ సబ్సిడీ పోగా లబ్ధిదారుడి వాటాగా రూ. 43,750ల చొప్పున 852 మంది డీడీలు అందజేశారని తెలిపారు. ఇటీవల జిల్లాలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని పరిశీలించిన ఆరోగ్య, కుటుంబ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 'ఐకేపీ, వీఓఏల సమస్యలు పరిష్కరించాలి'

మనోహరాబాద్/శివ్వంపేట(నర్సాపూర్): ఐకేపీ, వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో జిల్లాలో సుమారు 700 మంది పని చేస్తున్నారని తెలిపారు. అలాగే శివ్వంపేటలో వీఓఏల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎంకు వినతిపత్రం అందజేశారు.

## బీఆర్‌ఎస్ నేతల మధ్య తోపులాట



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న సర్పంచ్ రాజిరెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి వర్గీయుల మధ్య శనివారం తోపులాట చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా పాఠశాల తరగతి గదుల ప్రారంభోత్సవానికి రావడంపై ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. తాను అభివృద్ధి పనులకు ఆటంకం కాదని, కనీసం సర్పంచ్ అనే గౌరవం ఇవ్వరా అని వాపోయారు. ఇదే విషయమై స్థానిక నాయకులు అంజిరెడ్డి, లక్ష్మారెడ్డితో గొడవకు దిగారు. ఒకదశలో ఇరువర్గాలు ఒకరినొకరు తోసుకున్నారు. విషయం గమనించిన పోలీసులు ఇరువర్గాలను అడ్డుకుని శాంతింపజేశారు. ఎనిమిదేళ్లుగా డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నామని.. ఎప్పుడు న్యాయం చేస్తారని మండలంలోని కొర్విపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇళ్ల కోసం తీసుకువచ్చిన ఇసుక, స్టీల్‌ను సైతం తరలించుకుపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలతో విడివిడిగా మాట్లాడిన ఎమ్మెల్యే వారిని సముదాయించారు. త్వరలోనే ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. అదనంగా మరో 20 ఇళ్ల నిర్మాణానికి నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంలో టీఎస్‌పీఎస్సీ పాలకవర్గాన్ని వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం చేగుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 30 లక్షల నిరుద్యోగుల జీవితాలకు భరోసా కల్పించాల్సిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో అభాసుపాలైందన్నారు. సిట్ విచారణతో నిజాలు బయటకు రావన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ కొత్త పాలకవర్గం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈవిషయంలో ప్రభుత్వం స్పందించకుంటే నిరుద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మెదక్ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జి చింతా సంతోష్, అసెంబ్లీ కన్వీనర్ ఎస్‌ఎన్ చారీ, కో కన్వీనర్ గోవింద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేష్, మండలశాఖ అధ్యక్షుడు భూపాల్, నాయకులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి




మాట్లాడుతున్న బోదకుంటి వెంకటేశ్వర్లు

మాజీ ఎమ్మెల్సీ బోదకుంటి వెంకటేశ్వర్లు

మనోహరాబాద్(తూప్రాన్): కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని సిద్దిపేట జిల్లా ఆత్మీయ సమ్మేళన ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బోదకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా సమావేశంలో ఉద్యమ సమయం నుంచి పార్టీలో పనిచేస్తున్నా కొందరు నాయకులు అణగదొక్కుతున్నారని మండల నాయకులు వంగాల రమేశ్‌గౌడ్, మొంగ్యా నాయక్ నిరసన వ్యక్తం చేశారు. వీరిని పలువురు బుజ్జగించారు. అనంతరం పార్టీ కార్యకర్త క్లెం రమేశ్ ప్రమాదవశాత్తు మృతిచెందగా ప్రమాదబీమా రూ. 2 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఎంపీపీ పురం నవనీత రవి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

## 'డబుల్' ఇళ్ల కేటాయింపు



డ్రా తీస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో నిర్మించిన 304 డబుల్ బెడ్రూం ఇళ్లను శనివారం కలెక్టర్ రాజర్షిషా, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించారు. ఈనెల 5వ తేదీన మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వారు తెలిపారు. నిరుపేదలతో పాటు మైనార్టీలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రభుత్వానికి భూమి ఇచ్చిన వారికి ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయించినట్టు పేర్కొన్నారు. అంతకుముందు మెదక్ ఆర్డీఓ సాయిరాం, ఇతర ఉన్నతాధికారులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ రామాయంపేటలో నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు.

## కలెక్షన్ ఫుల్..

### ఎక్సైజ్, ఆర్టీఏ, మైనింగ్ ద్వారా భారీ ఆదాయం

ఇచ్చిన టార్గెట్ రూ. 554.23 కోట్లు ● వసూలు చేసింది రూ. 596.23 కోట్లు



మెదక్‌జోన్: జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం ఎక్సైజ్, ఆర్టీఏ, మైనింగ్ శాఖలు ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చి పెట్టాయి. టార్గెట్‌కు మించి వసూలు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిలో అత్యధికంగా ఎక్సైజ్, రెండోస్థానంలో ఆర్టీఏ కాగా మూడో స్థానంలో మైనింగ్ నిలిచింది. ఈ మూడు శాఖలకు ప్రభుత్వం ఏడాదికి ఇచ్చిన టార్గెట్ రూ. 554.23 కోట్లు కాగా రూ. 596.23 కోట్లు వసూలు చేశారు. ఈ లెక్కన ఇచ్చిన టార్గెట్ కన్నా రూ. 42 కోట్లు అదనంగా వసూలు చేశారు.

**అత్యధికంగా ఎక్సైజ్ నుంచే..**

జిల్లాలో 49 వైన్స్‌లు, 4 బార్లు ఉండగా ఈ ఏడాది ఎక్సైజ్‌కు టార్గెట్ రూ. 5 వందల కోట్లు ఇచ్చారు. కానీ అధికారులు రూ. 534 కోట్లు వసూలు చేశారు. ఈలెక్కన అదనంగా రూ. 34 కోట్లు వసూలు చేసినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 2022లో మద్యం ద్వారా వార్షిక ఆదాయం రూ. 461 కోట్లు రాగా ఈ ఏడాది రూ. 534 కోట్ల ఆదాయం వచ్చింది. ఈలెక్కన గతేడాదితో పోల్చుకుంటే రూ. 73 కోట్లు అదనం కాగా 10 శాతం అధికంగా ఎక్సైజ్‌శాఖ ఆదాయాన్ని సమకూర్చింది.

**ఆర్టీఏ.. 12శాతం అధికం**

రోడ్డు రవాణాశాఖ సైతం ప్రభుత్వానికి మంచి ఆదాయాన్ని సమకూర్చింది. ఈ ఏడాది ఆర్టీఏ శాఖకు రూ. 43.73 కోట్ల టారెగెట్ కాగా వార్షిక ఆదాయం రూ. 50.28 కోట్లు తెచ్చి పెట్టింది. ఈలెక్కన రూ. 6.55 కోట్లు అదనంగా వచ్చాయి. అంటే గతేడాదితో పోల్చుకుంటే 12 శాతం అదనంగా వసూలు చేశారు. ట్రాన్స్‌పోర్టు వాహనాలకు ప్రతిమూడు నెలలకోసారి త్రైమాసిక ట్యాక్సీ వసూలు చేస్తారు. ఇందుకు సంబంధించి రూ. 7.58 కోట్లు, లైఫ్ ట్యాక్సీకి సంబంధించి ఈఏడాది రూ. 32.41 కోట్లు వసూలు చేశారు. లైసెన్స్ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఫీజులు రూ. 6.76 కోట్లు, సర్వీస్ ఫీజులకు సంబంధించి రూ. 1.56 కోట్లు వసూలు చేశారు. జరిమానా 1.97 కోట్లు కలిపి మొత్తం ఆర్టీఏ శాఖ ద్వారా రూ. 50.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు.

**రూ. 1.44 కోట్లు అదనం**

మైనింగ్ శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రూ. 10.50 కోట్లు రావాల్సి ఉండగా రూ. 11.94 కోట్లు సమకూర్చారు. ఈలెక్కన రూ.1.44 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరింది. గతేడాది 2022లో రూ. 9.58 కోట్ల ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ. 2.36 కోట్ల అదనపు ఆదాయం సమకూరింది. జిల్లావ్యాప్తంగా 16 క్రషర్లు ఉన్నాయి. ఇవి పెద్ద పెద్ద బండరాళ్లను చిన్నపాటి చిప్స్‌గా మారుస్తున్నాయి. అలాగే 15 క్వారీలు నడుస్తున్నాయి. ఇవి భూమిలో గల తెల్లటి బండరాళ్లను తవ్వితీస్తుండగా మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. జిల్లా పరిధిలోని మాసాయిపేట, వెల్దుర్తి, కొల్చారం, తదితర మండలాల్లో తవ్వుతున్నారు.

### టార్గెట్‌ను మించి చేశాం



ఈ వార్షిక సంవత్సరం ఎక్సైజ్ శాఖ టార్గెట్ రూ. 500 కోట్లు కాగా రూ. 534 కోట్లు వసూలు చేశాం. అదనంగా రూ. 34 కోట్లు వచ్చింది. ఉన్నతాధికారులు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడం సంతోషంగా ఉంది.

– రజాక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

## క్లుప్తంగా

### మట్టి తరలింపు అడ్డగింత


అయినాపూర్‌లో మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లి గ్రామం నుంచి అయినాపూర్ గ్రామంలోని ఓ వెంచర్‌కు మట్టి తరలిస్తున్న వాహనాలను సర్పంచ్ చెరుకు రమణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులను పలుమార్లు సంప్రదించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మట్టి తరలింపు నిలిపివేయాలని కోరారు. అనంతరం కొమురవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

### అత్యాశకు పోతే అంతే..

సిద్దిపేటకమాన్: అపరిచితుడు పంపిన లింక్‌ను ఓపెన్ చేసి బాధితుడు తన ఖాతాలో నుంచి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో జరిగింది. సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నాను అంటూ మాటలు కలిపాడు. మీరు ఆర్డర్ చేసిన వస్తువులు డెలివరీ చేస్తున్నాము, అన్ని వస్తువులు ఉన్నాయో? లేదా ? అని చెక్ చేసుకోవాలని ఓ లింకును బాధితుడి సెల్‌ఫోన్‌కు పంపించాడు. అది నమ్మిన బాధితుడు ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే తన ఖాతా నుండి రూ.31,497 డబ్బులు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

**అపరిచితుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దు**

గజ్వేల్‌రూరల్: లాటరీ వచ్చిందని చెప్పి డబ్బులు డిమాండ్ చేసే సైబర్ నేరగాళ్ల మాయలో పడొద్దని శనివారం గజ్వేల్ పోలీసులు అన్నారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బాధితునికి గుర్తు తెలియని నంబర్ నుంచి సైబర్ నేరస్తుడు కేరళ లాటరీ నుంచి ఫోన్ చేస్తున్నామని, రూ.5 లక్షల లాటరీ వచ్చిందని నమ్మబలికాడు. లాటరీ డబ్బులు రావాలంటే ఒక శాతం టాక్స్, జీఎస్టీ చెల్లించాలన్నాడే. దీంతో సైబర్ నేరస్తుడు చెప్పిన విధంగా రూ.5 వేలు పంపించి, తర్వాత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయాయని తెలుసుకొని జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించి రూ.1400 ఫ్రీజ్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.



# అనుమతి లేకుండా చెట్ల కూల్చివేత

- ఆనవాళ్లులేకుండా నిప్పుపెడుతున్న వైనం
- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

నర్సాపూర్: ఓ వెంచర్‌లో చెట్లను నరికి ఆనవాళ్లు లేకుండా వాటికి నిప్పు పెడుతున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే పలు రకాల భారీ వృక్షాల తోపాటు తాటి చెట్లను వెంచర్ నిర్వాహకులు నరికి కాల్చివేస్తున్నా ఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మండలంలోని ఎల్లాపూర్‌లో భూ వ్యాపారులు సుమారు 53 ఎకరాలలో ఫాంల్యాండ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందు కోసం కొనుగోలు చేసిన భూమిని చదును చేసే పనులు చేపట్టారు. అందులో ఉన్న భారీ వృక్షాలతోపాటు పదుల సంఖ్యలో తాటిచెట్లను నరికి వాటిని కాల్చివేస్తున్నారు.

ఆయా రకాల చెట్లను నరకడానికి రెవెన్యూ శాఖ నుంచి, తాటి చెట్లను నరకడానికి ఎక్సైజు శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కాగా ఏ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందకుండానే చెట్లను కూల్చివేస్తున్నారు. తాటి చెట్లను నరికి వాటి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మొదళ్లకు నిప్పంటిస్తున్నారు. అడ్డగోలుగా చెట్లను నరకడంతో పాటు ఆనవాళ్లు లేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయంపై ఎక్సైజు సీఐ పద్మను వివరణ కోరగా ఎల్లాపూర్‌లో తాటి చెట్లు నరికినట్లు తమ దృష్టికి రాలేదన్నారు. చెట్ల నరికివేతకు తాము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. వెంచర్ సూపర్‌వైజర్ నరేశ్‌ను అనుమతులు పొందారా అని అడగ్గా తనకు ఏమీ తెలియదని బదులిచ్చాడు.


ఎల్లాపూర్ వెంచర్‌లో తగలబడుతున్న తాటి చెట్లు

# మైనర్లు వాహనాలు నడపొద్దు

**సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మైనర్లు వాహనాలు నడపొద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రంగధాంపల్లిలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు ట్రాఫిక్, మోటారు వాహనాల చట్టాలు, రోడ్డు సేఫ్టీ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. మానవ తప్పిదం, అధిక వేగం, మద్యం తాగి వాహనాలు నడపడంవల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. త్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపే వారికి ఈ-చలాన్‌ల ద్వారా జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రాంగ్ రూట్లో వాహనం నడపొద్దని, పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్క్ చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ లేజర్ గన్ ద్వారా రాజీవ్ రహదారిపై వాహనాల వేగాన్ని తగ్గించడానికి కేసులు ఏ విధంగా నమోదు చేయడం జరుగుతుందో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సిగ్నల్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లు

## జనగామ, గౌరవెల్లి గ్రామాలను విలీనం చేస్తే ఊరుకోం

- అఖిలపక్షం నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ ప్రకటించిన అక్కన్నపేట మండలంపై చిన్నచూపు ఎందుకని, జనగామ, గౌరవెల్లి గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తే ఊరుకోబోమని అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అక్కన్నపేట మండలంలో కొనసాగుతున్న సమీప గ్రామాలను హుస్నాబాద్‌లో కలపాలన్న ఆలోచన మానుకోవాలన్నారు. అక్కన్నపేట మండల ఉనికి ప్రమాదంలో నెట్టేందుకు కుట్ర సాగుతోందని, ఇందులో భాగంగానే గౌరవెల్లి ప్రాజెక్టు ఉందని ఆ గ్రామాన్ని విలీనం చేస్తున్నారన్నారు. త్వరలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించాలని, స్పందించకుంటే ఆందోళనకు దిగుదామని తీర్మానం చేశారు. సమావేశంలో అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, రైతు సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ కందుల రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కర్ణకంటి శ్రీశైలం, జాగిరి సత్యనారాయణ, కాశబోయిన ఎల్లయ్య, తొందూరు ఎల్లయ్య, బీజేపీ నాయకులు నూనావత్ మోహన్‌నాయక్, భూక్య సుధాకర్ నాయక్, చెరుకు సంపత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశమైన అఖిలపక్ష నేతలు

## అపరిచితుడి హల్‌చల్

**చితకబాదిన కాలనీవాసులు**

జిన్నారం(పటాన్‌చెరు): రాత్రి వేళలో షర్ట్‌లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో అర్ధరాత్రి ఓ వ్యక్తి షర్ట్ లేకుండా తిరుగుతుండటంతో స్థానికులు గమనించారు. మతిస్థిమితంలేనివాడిగా ప్రవర్తిస్తూ ఓ ఇంటి గేటు ముందు సంచరిస్తున్నాడు. తెల్లవారుజాము వరకు స్థానికులు అతడిని గమనిస్తూ ఉండి పట్టుకున్నారు. ఎందుకు వచ్చావని ప్రశ్నిస్తూనే చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నాగాలాండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పిచ్చివాడిలా ఉన్నాడని, కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు. షర్ట్ లేకుండా తిరుగుతున్న వ్యక్తి చెడ్డీ గ్యాంగ్‌కు చెందిన వారు తిరుగుతున్నారేమోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో కాలనీలో బందోబస్తును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కాలనీలో సంచరించిన వ్యక్తి ఇతడే..

## చిన్నారిపై వృద్ధుడి అత్యాచారయత్నం

- చితకబాది పోలీసులకు అప్పగించిన కుటుంబ సభ్యులు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లా అందోల్ గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై వృద్ధుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ బాలిక దగ్గర్లోని కిరాణా షాపులో చాక్లెట్ కొనుక్కోవడానికి ఇంటి నుంచి బయలుదేరింది. బాలిక వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో అటుగా వెళ్తున్న అదే ప్రాంతానికి చెందిన వడ్డే సాయిలు (60) ఆమెపై అత్యాచారాయత్నానికి ప్రయత్నించాడు. చిన్నారి తల్లి చూసి అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి వృద్ధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే జోగిపేట ఎస్‌ఐ సామ్యా నాయక్ వచ్చి వృద్ధుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వృద్ధుడిని తీసుకువెళ్తున్న పోలీసులు

## ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు - ఆటో ఢీ

- ఒకరి పరిస్థితి విషమం
- మరో యువకుడికి గాయాలు

దుబ్బాక: ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు- ఆటో ఢీ కొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం జరిగింది. 108 సిబ్బంది, స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొగుట మండలం వర్ధరాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎరువ తిరుమల్ రెడ్డి, అతడి స్నేహితుడు రేపాక ప్రసాద్ పని నిమిత్తం దుబ్బాకు వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. హబ్సీపూర్ నుంచి దుబ్బాక వస్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆర్టీసీ బస్సు, ఆటో ఎదురెదురుగా ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ తిరుమల్ రెడ్డికి తీవ్రంగా, ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ తిరుమల్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

**గుర్తు తెలియని వాహనం ఢీకొని..**

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తూప్రాన్ నర్సాపూర్ ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన జంగిడి శ్రీనివాస్ తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పోతురాజుపల్లిలో నివాసం ఉంటున్నాడు. శనివారం టీవీఎస్ ఎక్సెల్‌పై చండీకి వచ్చి తిరిగి పోతురాజుపల్లికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


గాయపడ్డ ఆటో డ్రైవర్ తిరుమల్ రెడ్డి


శివ్వంపేట(నర్సాపూర్): తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్

## రోడ్డు ప్రమాదంలో వార్డు సభ్యుడి మృతి

మర్కుక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వార్డు మెంబర్ మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు కనకయ్య(42) శనివారం ఉదయం మర్కుక్ మండలం పాములపర్తికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చేబర్తి సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ కనకయ్య బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ మేరకు మర్కుక్ ఎస్‌ఐ హరీశ్ కేసు నమోదు చేసుకొన్నారు. కనకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.


కనకయ్య మృతదేహం

## చికిత్స పొందుతున్న వివాహిత మృతి

రామాయంపేట(మెదక్): యువకుడి దాడిలో తీవ్రంగా గాయపడిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన చౌకి ప్రవంతి (42) గతనెల 28వ తేదీన తన ఇంట్లో నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన పున్న శ్రీకాంత్ కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడటంతో ఆమెను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త లక్ష్మీపతి, కూతురు, కుమారుడు ఉన్నారు.


ప్రవంతి (ఫైల్)

## చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడు..

రాయికోడ్(అందోల్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పాంపాడ్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఏడుకొండలు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ మియా (36) చేపల వేట కోసం మార్చి 30వ తేదీన పాంపాడ్ శివారులోని మంజీరా నది బ్యాక్ వాటర్‌లో చేపల వేట కోసం వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలోని పరిచయస్తుల వద్ద ఆరా తీసి నది పరిసరాల్లో వెతికారు. మహబూబ్‌మియా దుస్తులు, ఇతర వస్తువులు చెరువు ఒడ్డున ఉండటంతో నది నీటిలో గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం నీటిలో మృతదేహం తేలింది. మృతుడి భార్య సహేరా బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


షేక్ మహబూబ్ మియా (ఫైల్)

## బెజ్జంకిలో స్వీట్ షాపుల తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని పలు స్వీట్ షాపులను ఎస్‌ఐ ప్రవీణ్‌రాజు సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. తాజాగా తయారు చేసిన తినుబండారాలను విక్రయించాలని సూచించారు. హోటల్‌లో పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఎక్కువ రోజులు తినుబండారాలుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


బెజ్జంకి స్వీట్ షాపులో స్వీట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రవీణ్‌రాజు

## బస్సులో మర్చిపోయిన బ్యాగు, నగదు అందజేత


వృద్ధురాలికి సంచి అందిస్తున్న డ్రైవర్, కండక్టర్

కొండపాక(గజ్వేల్): బస్సులో మరిచిపోయిన బ్యాగు, నగదును ఆర్టీసీ సిబ్బంది వృద్ధురాలికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెలికట్టకు చెందిన వృద్ధురాలు దుద్దెడ లచ్చవ్వ శనివారం మధ్యాహ్నం జనగామలో సిద్దిపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కింది. లచ్చవ్వ ఆగమై వెలికట్ట గ్రామ శివారులో జనగామ క్రాస్‌రోడ్డు వద్ద బస్సు దిగింది. దీంతో బస్సు వెళ్ళిపోయింది. బస్సు దిగిన వృద్ధురాలు లచ్చవ్వ ఏడుస్తూ కనిపించింది. విషయం తెలుసుకున్న శేఖర్ లచ్చవ్వ వద్ద ఉన్న టికెట్ ఆధారంగా బస్సు డ్రైవర్ ఫోన్ చేసి విషయం తెలిపాడు. మళ్లీ సిద్దిపేట నుంచి జనగామ వెళ్లే దారిలో జనగామ క్రాస్ రోడ్డు వద్ద బస్సు డ్రైవర్ నర్సింహులు, కండక్టర్ కృష్ణవేణి లచ్చవ్వ సంచితో, అందులో ఉన్న రూ.2 వేల నగదు అందజేశారు.

## ఎన్సీఎల్ పరిశ్రమల యజమాని..

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం తురకల ఖానాపూర్ శివారులోని ఎన్సీఎల్ గ్రూప్ పరిశ్రమల ఎండీ, వెన్నెల ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కలిదిండి మధు (67) శనివారం మృతి చెందారు. ఈయన మండల పరిధిలోని తురకల ఖానాపూర్, ముచ్చర్ల గ్రామపంచాయతీలలో గత 35 సంవత్సరాల క్రితం నాగార్జున సెక్యులర్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్) పరిశ్రమను నెలకొల్పారు. ఆ పరిశ్రమలో స్థానికులకే ఉపాధి కల్పించాడు. అంతేకాకుండా వింటెక్, ఎన్‌సీఎల్ సెక్యులర్ పేర్లతో పరిశ్రమలను నెలకొల్పారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లలకు విద్యను అందించడం కోసం వెన్నెల ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేశారు. కాగా కొన్నిరోజులుగా కలిదిండి మధు అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస వదిలారు. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమల కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తుర్కలఖానాపూర్ శివారు ఎన్‌సీఎల్ పరిశ్రమ నుంచి దౌల్తాబాద్లోని తెలంగాణ తల్లి చౌరస్తా వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.


మధు (ఫైల్)

## రోడ్డు దాటుతున్న వారిని ఢీకొట్టి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండల పరిధిలోని భానూర్ బీడీఎల్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న వీర వెంకట సాయిరామ్ అలియాస్ సాయి(20)ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయి తండ్రి వెంకటరావు బీడీఎల్ కార్మికుడు. వారికి భారతినగర్ డివిజన్ పరిధి బీడీఎల్ కాలనీలో ఇల్లు ఉంది. ఇంటి పని నిమిత్తం సాయి బీడీఎల్ కాలనీకి వచ్చాడు. తిరిగి మధ్యాహ్నం తన వాహనంపై లింగంపల్లి నుంచి పటాన్‌చెరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రామచంద్రారెడ్డినగర్ కాలనీ ముఖద్వారం వద్ద జాతీయ రహదారిపై కొందరు బస్సు ముందు నుంచి రోడ్డు దాటుతున్నారు. అందులో ఒకరిని ఢీ కొట్టి సాయి ప్రైవేట్ బస్సు కిందపడిపోయాడు. బస్సు సాయి తలపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుయ్యారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాథ్ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


సాయి మృతదేహం

## వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం పొందాడు. ఈ ఘటన శనివారం వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వేలూరుకు చెందిన చీమల శేఖర్(30)కు భార్య భాగ్య, రెండేళ్లలోపు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కొంత కాలం నుంచి మృతుడు మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఇబ్బందిపెడుతున్నాడు. వారం కిందట శేఖర్ భార్య భాగ్య పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం శేఖర్ మద్యం తాగొచ్చి చెల్లెలి పెళ్లి విషయమై తండ్రి రమేశ్‌తో గొడవపడ్డాడు. ఆ తరువాత రాత్రి భోజనం చేసి నిద్రించేందుకు ఒకటో అంతస్తులోని తన బెడ్రూంకు వెళ్లి గడియ వేసుకున్నాడు. శనివారం ఉదయం అన్న గదికి వెళ్లిన చెల్లెలు తలుపులు తెరిచేందుకు ప్రయత్నించింది. లోపల గడియవేసినట్లు గమనించి కుటుంబీకులకు తెలిపింది. వారు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిచూడగా శేఖర్ ఉరేసుకుని కనిపించాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**చెరువులో దూకి మహిళ..**

చేర్యాల(సిద్దిపేట): భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో మనస్తాపం చెంది భార్య ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తదొమ్మాట గ్రామానికి చెందిన బాల్‌నర్సయ్య కొద్ది రోజుల క్రితం చెట్టు కొట్టే క్రమంలో తలపై కొమ్మ తగిలి గాయపడ్డాడు. శస్త్రచికిత్స జరిగినా ఆరోగ్యం కుదటపడలేదు. దీంతో భార్య చింతల కలవ్వ(43) తీవ్ర మనస్తాపం చెందింది. శుక్రవారం జొన్నలు తెస్తానని వెళ్లి తిరిగిరాలేదు.

పుట్టింటికి వెళ్లిందని భర్త భావించాడు. శనివారం ఉదయం చేర్యాల పెద్ద చెరువులో దూకి కలవ్వ ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు బాల్‌నర్సయ్యకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాల్‌నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## లారీ దొంగ రిమాండ్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పార్కింగ్ చేసిన లారీని ఎత్తుకెళ్లిన దొంగను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చత్తీస్‌గఢ్‌కు చెందిన దేవనారాయణ్ సాహుగా గుర్తించారు.



## అనుమానాస్పద స్థితిలో ..


శివశంకర్ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలో ఓ వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్వెల్లి గ్రామానికి చెందిన సుకూరి శివశంకర్(46) శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారిని విచారించినా శివశంకర్ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం శ్రీ లక్ష్మీనర్సింహా వైన్స్ సిబ్బంది శుభ్రం చేయడానికి వచ్చి చూడగా వైన్స్ పర్మిట్‌రూంలో విగతజీవిగా కనిపించాడు. దీంతో మృతుడి కుటుంబీకులకు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కొన్నేళ్లుగా శివశంకర్‌కు మద్యం తాగే అలవాటు ఉన్నప్పటికీ ఇలా జరగలేదని ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, మహిళలు వైన్స్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వైన్స్ షాపుపై రాళ్లతో దాడిచేశారు. బోర్డులను ధ్వంసం చేయడంతో పాటు తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. శివశంకర్ మృతిచెందిన ఘటనపై వైన్స్ నిర్వాహకులు పరామర్శించడానికి రాకపోవడంతో మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు వైన్స్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసేవరకు కదిలేది లేదని మృతదేహాన్ని వైన్స్ ఎదుట ఖననం చేసేందుకు ప్రయత్నించారు. వారిని అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు, కుటుంబీకులు కలిసి రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనకారులు శాంతింపజేశారు. జోగిపేట సీఐ నాగరాజు, ఎస్‌ఐ సామ్యనాయక్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు చివరికి ఖననం చేసేందుకు తీసిన గోతిలో కోడిని పూడ్చివేసి వెళ్లిపోయారు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ అంబర్యా తెలిపారు.

## మున్సిపల్ సిబ్బందిపై దాడి

గజ్వేల్‌రూరల్: మున్సిపల్ సిబ్బంది విధులను అడ్డుకొని, వారిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు శనివారం గజ్వేల్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గజ్వేల్ పట్టణంలోని కోటమైసమ్మ దేవాలయ సమీపంలో అక్రమంగా నిర్మించిన దాబా(రెస్టారెంట్) కట్టడాన్ని తొలగించాలని ఇటీవల మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అక్రమ కట్టడ నిర్వాహకులు గాజుల చంద్రమౌళి, అతని ముగ్గురు కొడుకులు శనివారం అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన మున్సిపల్ టీపీవో శ్రీధర్‌రెడ్డి, సిబ్బందిపై దాడి చేశారు. దీంతో మున్సిపల్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని టీపీవో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.